


17న స్విమ్స్‌లో బీఎస్సీ కోర్సులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఈనెల 17వ తేదీన బియస్సీ (నర్సింగ్), బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరఫీ, బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సు (పారా మెడికల్) కోర్సుల 4వ విడత మరియు ఫైనల్ ఆఫ్ లైన్ విధానం ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్టర్ ప్రకటన తెలిపారు. ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. బి.యస్సీ నర్సింగ్ -32 సీట్లు, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరఫీ 11 సీట్లు, బి.యస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ (పారా మెడికల్) 28 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, పూర్తి ఫీజుతో హాజరు కాగలరు. ఇంతకు మునుపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే 4వ విడత కౌన్సిలింగ్ జరుపబడును, కౌన్సిలింగ్‌కు ఇంతకు మునుపు దరఖాస్తు చేయనివారు అర్హులు కాదు. ర్యాంక్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు లోబడి సీట్లు భర్తీ చేయబడునని పేర్కొన్నారు.

శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత

భక్తుల సమాచారంతో అలెర్ట్

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత సంచరిస్తున్నట్టు భక్తులు గుర్తించారు. వేగంగా రోడ్డు దాటుతున్న చిరుత పులిని చూసినట్టు పులివెందులకు చెందిన కొంతమంది భక్తులు చెప్పారు. దీనిపై వారు టీటీడీ అధికారులకు కూడా సమాచారం అందించారు. దీంతో కాలినడకన వెళ్లే భక్తులను టీటీడీ అధికారులు గుంపులు గుంపులుగా పంపిస్తున్నారు. వాటర్ హౌస్ దగ్గర భద్రతా సిబ్బంది భక్తులను నిలిపి గుంపులు.. గుంపులుగా పంపుతున్నారు. చిరుత సంచారంతో శ్రీ వారి భక్తులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల కిందట చిరుతల సంచారం ఎక్కువగా ఉండటంతో వాటిని ఫారెస్ట్ అధికారులు బంధించి వేరో చోట విడిచిపెట్టారు. ఇప్పుడు మరో చిరుత కనిపించడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

లక్ష్మీ కాసుల హారం ఊరేగింపు



ప్రజాశక్తి- తిరుమల: శ్రీపద్మావతి దేవికి మంగళవారం రాత్రి జరిగే మహోన్నత గజ వాహనంలో శ్రీవారి లక్ష్మీ కాసుల హారాన్ని నవంబర్ 14న తిరుమల నుంచి తిరుచానూరు వరకు టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. శ్రీ వేంకటేశ్వర స్వామికి అత్యంత విలువైన, ముఖ్యమైన ఆభరణాలలో లక్ష్మీ కాసుల హారం ఒకటి. ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య మాడ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం తిరుమల నుంచి తిరుచానూరులోని శ్రీ పద్మావతి ఆలయానికి ఉత్సవ ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. ప్రతి సంవత్సరం కార్తీక బ్రహ్మోత్సవాలలో 5వరోజు సాయంత్రం గజవాహన సేవలో పద్మావతి అమ్మవారి అలంకారానికి శ్రీవారి లక్ష్మీ కాసుల హారం తీసుకురావడం ప్రతిష్టాత్మకమైన సంప్రదాయం.

మ్యుటేషన్స్ దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

జిల్లాలో సర్వే రాళ్ళు నాటే పక్రీయను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు దష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కన్ఫరెన్స్ హాల్‌లో వర్చువల్ విధానంలో ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, సర్వే డీటిలతో రీసర్వే, మ్యుటేషన్, సాదాబైనామా, అసైన్మెంట్ భూములు, రాళ్ళు నాటే పక్రియ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియలో భాగంగా రీసర్వే ఫేజ్ -3 పూర్తయిన గ్రామాలలో ఫైనల్ ఆర్ఓఆర్ పనులు తొందరగా పూర్తిచేయాలని తెలిపారు. రీసర్వే ఫేజ్ 3కు సంబంధించి 140 గ్రామాలకు గాను 24 గ్రామాలలో రాళ్ల నాటే ప్రక్రియ పూర్తయిందని మిగిలిన గ్రామాలలో ఈ ప్రక్రియను నిర్దేశించిన గడువులోపు పూర్తిచేయాలని అన్నారు. రోజు వారి ప్రణాళికతో మ్యుటేషన్స్‌కు సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. అసైన్మెంట్ భూములలో నేటికీ కొనసాగుతున్న నిబంధనల మేరకు అర్హులైన లబ్ధిదారులకు నిషేధిత జాబితా 22 (ఎ) నుంచి తొలగించి సంపూర్ణ రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించే ప్రక్రియకు సంబంధించిన కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా నవంబర్ 17 తేదీన జరుగుతుందన్నారు. కావున సంబంధిత అధికారులు అసైన్మెంట్ భూములకు వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. డిఆర్ఓ పెంచల్ కిషోర్, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ భవానీ శంకర్, ఏడి సర్వేయర్ జయరాజ్, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొట్టమొదటి సారిగా సైనిక్, మిలిటరీ స్కూల్లో

బాలికలకు 9వ తరగతిలో ప్రవేశం

ప్రజాశక్తి - క్యాంపస్

జాతీయ స్థాయిలో 2024-2025 విద్యా సంవత్సరానికి సైనిక్ స్కూల్, రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్‌లో తొలిసారిగా బాలికలకు 9వ తరగతిలో ప్రవేశానికై ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. మిలిటరీ స్కూల్స్ దరఖాస్తులు సమర్పించటానికి చివరి తేదీ 23 నవంబర్ 2023, సైనిక్ స్కూల్స్ దరఖాస్తులు సమర్పించటానికి చివరి తేదీ 16 డిసెంబర్ 2023 అని, ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తుల సమాచారం, నమూనా పరీక్షల కోరకు విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో సమాచారం పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించగలరన్నారు.

శ్రీవారి సేవలో బొజ్జల సుధీర్ దంపతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, బొజ్జల రిషితారెడ్డి పెళ్లి రోజును పురస్కరించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి వెళ్లారు. అక్కడ స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. వీరితో పాటు బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన గోడపత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

బాలల దినోత్సవం పురస్కరించుకుని చైల్డ్ రైట్స్ ఫర్ యు (క్రై), ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ విద్యతోనే సాధ్యమన్నారు. పిల్లలు చదువుకునే వయసులో పాఠశాలలోనే ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలని కోరుకున్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రగతి సిబ్బంది ప్రభాకర్, రామచంద్ర పాల్గొన్నారు.

అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జరిగే 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను తిరుపతి జిల్లా సహకార అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి స్థానిక ప్రాంతీయ కేంద్ర సహకార బ్యాంక్ తిరుపతి బ్రాంచ్‌లో ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు సహకారంతో సమద్ధిలో భాగంగా 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా భారత దేశాన్ని మార్చడానికి, సుస్థిరాభివది లక్ష్యాల సాధనకు సహకార రంగం ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్లు నాగవర్తన, తిరుపతి డివిజనల్ సహకార అధికారి రవిబాబు, జిల్లా సహకార అధికారి కార్యాలయపు సూపరింటెండెంట్ మద్దిపట్ల వెంకట్రమణ, సహకార బ్యాంకు అధికారి ఉమామహేశ్వర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టిటిడిలో 114 జీఓ అమలుకు గ్రీన్ సిగ్నల్

స్విమ్స్‌లో రూ.197కోట్లతో భవనాలు నిర్మాణం



టిటిడి పాలక మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మంగళవారం సమావేశం అయ్యింది. ఈసందర్భంగా పాలకమండలిలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేసేందుకు పాలకమండలి అంగీకారం తెలిపింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న ప్రభుత్వ జీవో నెంబర్ 114 మేరకు అర్హత ఉన్న ఉద్యోగులను టీటీడీలో రెగ్యులరైజ్ చేస్తామని పాలకమండలి ప్రకటించింది. ఈనెల 23వ తేదీ నుంచి అలిపిరి వద్ద శ్రీనివాస దివ్యానుగ్రహ హోమాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. హోమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తామని.. హోమంలో పాల్గొనే భక్తులు వెయ్యి రూపాయాలు చెల్లించి టిక్కెట్టు పొందవలసి ఉంటుందని తెలిపారు. టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించిన వడమాలపేట వద్ద గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.25.67కోట్లు కేటాయిస్తున్నామని.. ఈ సొమ్మును తిరిగి ఉద్యోగులు నుంచి రీయింబర్స్ చేసుకుంటామని చెప్పారు. టీటీడీలో పని చేసే ప్రతి ఉద్యోగికి ఇంటిస్థలం కేటాయిస్తామని టీటీడీ ఛైర్మన్ ప్రకటించారు.

మరిన్ని టీటీడీ పాలకమండలి నిర్ణయాలు..

తిరుపతిలోని రామ్ నగర్ క్వార్టర్స్ అభివద్ధి పనులకు రూ.6.15 కోట్లు కేటాయింపు. టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానంగా రూ.14 వేలు.. కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.6850. ప్రసాదాలు, ముడిసరుకులు నిల్వ ఉంచడానికి రూ.11కోట్లతో అలిపిరి వద్ద గోడౌన్లు నిర్మాణం. మంగళం నుంచి రేణిగుంట వరకు రోడ్డు అభివద్ధి పనులకు రూ.15 కోట్లు కేటాయింపు. ఎంఆర్‌పల్లి జంక్షన్ నుంచి అన్నమయ్య వరకు రోడ్డు అభివద్ధి పనులకు రూ.4.5 కోట్లు కేటాయింపు. పుదిపట్ల జంక్షన్ నుంచి వకులమాత ఆలయం వరకు రోడ్డు నిర్మాణంకు రూ.21 కోట్లు కేటాయింపు. ఆయుర్వేద హాస్పిటల్‌లో రూ.1.65 కోట్లతో నూతన భవనం నిర్మాణం. రుయాలో టిబి రోగుల కోసం రూ.1.79కోట్లతో నూతన వార్డు నిర్మాణం. స్విమ్స్‌లో రూ.3.35కోట్లతో నూతన భవనాలు నిర్మాణం. స్విమ్స్‌లో నూతన కార్డియో, న్యూరో బ్లాకల ఏర్పాటుకు రూ.74 కోట్లు కేటాయింపు. స్విమ్స్‌లో రూ.197కోట్లతో నూతన ఆధునాతమైన భవనాలు నిర్మాణం. నడకదారిలో భక్తుల భద్రత కోసం రూ.3.5కోట్ల వ్యయంతో ట్రాప్ కెమరాలు కొనుగోలు. కరీంనగర్‌లో పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయనిర్మాణానికి రూ.15.54 కోట్లు కేటాయింపు. ప్రాచీనకళలు ప్రోత్సహించడానికి కలంకారి, శిల్పకళల కోసం సాయంకాలం కోర్సులు ప్రారంభిస్తామని టీటీడీ ఛైర్మన్ పేర్కొన్నారు. టీటీడీలో అర్హత ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాంట్రాక్ట్, కార్పోరేషన్ పరిధిలో ఉన్న ఉద్యోగులను అర్హత మేరకు రెగ్యులరైజ్ చేస్తాం ఈవో ధర్మారెడ్డి స్పష్టం చేశారు.

పేదలకు దూరమవుతున్న స్విమ్స్

ప్రతిష్ట కోల్పోతున్న వైనం


కార్మికులపై వేధింపులను ఆపండి: సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

స్విమ్స్ ఆసుపత్రి టీటీడీ యాజమాన్య పరిధిలోకి వచ్చిన తర్వాత పేదలకు దూరమవుతున్నదని, స్విమ్స్ సిబ్బంది యావత్తూ తీవ్ర అసంతప్తితో ఉన్నారని, తక్షణం సమస్యలను పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్విమ్స్ ఆసుపత్రిని సేవారంగంగా కాకుండా ఆదాయ వనరుగా చూడటాన్ని కందారపు మురళి తీవ్రంగా వ్యతిరేకించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు స్విమ్స్ ఆసుపత్రి శంకుస్థాపన సందర్భంగా మాట్లాడిన మాటలను ఆయన గుర్తు చేశారు. నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడానికి తమ ప్రభుత్వం స్విమ్స్ ఆసుపత్రిని స్థాపిస్తున్నదని, పేదలతో పాటు భక్తులకు, యాత్రికులకు ఇది ఎంతగానో తోడ్పడుతుందని ఆయన ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కాగా ప్రస్తుత టిటిడి యాజమాన్యం ఆరోగ్యశ్రీ, ప్రాణదానం వంటి ప్రజోపయోగమైన పథకాలను బలహీన పరుస్తున్నదని ఆరోపించారు. స్విమ్స్ ఆసుపత్రిలో ప్రతి విభాగానికి లక్ష్యాలు పెట్టి ఆదాయ మార్గాలపై కేంద్రీకరించాలని డాక్టర్లను, సిబ్బందిని ఒత్తిడికి గురిచేయడం సమంజసం కాదని అన్నారు. కార్మికులను లక్ష్మీ, శ్రీనివాసా కార్పొరేషన్‌లో కలిపి ఉద్యోగ భద్రత ఉంటుందని పదే... పదే ప్రకటించారని గుర్తుచేశారు. ఆచరణలో కార్పొరేషన్‌లోనే కార్మికుల పరిస్థితి అధ్వానంగా తయారైందని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు గతంలో యూనిఫాం కాంట్రాక్టర్ కొనుగోలు చేసేవాడని, ప్రస్తుతం కార్మికులను కొనుగోలు చేయమని ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. చిన్నచిన్న కారణాలతో కార్మికులను సస్పెండ్ చేయడం, తొలగించడం నిత్య కార్యక్రమంగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రాణదానం, ఆరోగ్యశ్రీలతో పాటు ఇతర వార్డుల్లో రోగులు కరువయ్యారని పడకలు ఖాళీగా ఉన్నాయని ఆరోపించారు. పేదలు దూరం కావడానికి కారణం ఎవరు? అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణం టీటీడీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి జోక్యం చేసుకొని స్విమ్స్ ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలపై సమీక్ష చేయాలని, ఉద్యోగులు కార్మికులు రోగుల సమస్యలు పరిష్కారం కావడానికి తోడ్పడాలని తిరిగి పూర్వస్థితికి స్విమ్స్ ఆసుపత్రి ఎదగడానికి తోడ్పడాలని కోరారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4జి టవర్లు ఏర్పాటు

బిఎస్ఎన్ఎల్ ఏపీ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్

బిఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జి నెట్‌వర్క్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం తెలిపారు. మంగళవారం తిరుపతి జిల్లా బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ అభ్యున్నతికి చర్యలు తీసుకున్నమని, ఫ్యాన్ ఇండియా ప్రాతిపదికన అనేక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వెల్లడించారు. బిఎస్ఎన్ఎల్ పనిచేసే ఉద్యోగులు అనేకమంది విఆర్ఎస్ తీసుకోవడం వల్ల కొంత వరకు లాభాల్లో నడుస్తా ఉందని చెప్పారు. 4జీ సేవలను మారుమూల ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయడానికి కషి చేస్తున్నట్టు వెల్లడించారు. బిఎస్ఎన్ఎల్ ఆదాయం రూ.1900కోట్లు డాటా అని, గత ఆర్థిక సంవత్సరం కంటే 14వ శాతం ఎక్కువ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్లో రూ.700 కోట్ల ఆదాయం కలిగి ఉందని వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం కంటే పది శాతం ఎక్కువ అని, ఉమ్మడి చిత్తూరు 4జి టవర్లను విస్తతంగా ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. వచ్చే ఏడాదికంతా 4జి టవర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బిఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్లో 4300 సెట్లలో 4జీ పరికరాలు ప్రారంభించాయని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 441 టవర్‌లో 43 పూర్తి చేశామని తెలిపారు. సముద్రమార్గంలో ఆయన తమిళనాడు నుంచి అండమాన్ నికోబార్ ఏడు దీవుల్లో కూడా కేబుల్ ఏర్పాటు చేశామని తెలిపారు. దీంతోపాటు కొచ్చి లక్ష దీపు సముద్ర మార్గంలో కేబుల్ వేయడం జరిగిందని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సమావేశంలో తిరుపతి జిల్లా బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ అమరేంద్రర్ రెడ్డి, బిఎస్ఎన్ఎల్ వెంకోబర్ రావు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి


ప్రజశక్తి- తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులకు ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం నుండి అనేక సంవత్సరాలుగా అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో గజవాహన సేవనాడు పట్టువస్త్రాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం కలగడం తన పూర్వజన్మ సుకతంగా భావిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విజీవో బాలిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంజాద్ కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఎస్వీ యూనివర్సిటీ ఉర్దూ విభాగం గెస్ట్ లెక్చరర్ అంజద్ అలీ ఖాన్ దక్కించుకున్నారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ ఉద్యోదిన పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన అవార్డులలో భాగంగా తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ చెందిన అంజాద్ ఆలీ ఈ అవార్డును కైవాసం చేసుకున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ని అభినందించారు.

విద్యార్థుల మేథోశక్తి అపూర్వం: టీటీడీ ఛైర్మన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: విద్యార్థుల మేథోశక్తి అపూర్వమైనదని, ఇప్పటి విద్యార్థుల ఆలోచనా స్పీడ్, షార్ప్ చాలా వేగవంతంగా ఉన్నాయని టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి స్మార్ట్ సిటి కార్పొరేషన్, తిరుపతి మున్సిపాల్టీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డే సందర్భంగా మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన తిరుపతి స్మార్ట్ క్విజ్ గ్రాండ్ ఫైనల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా హాజరైన భూమన బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని మేథోశక్తిని పెంపొందించేందుకు ఇలాంటి క్విజ్ పోటీలు మరిన్ని అవసరమన్నారు. నేటి పోటీ పరిస్థితుల నేపథ్యంలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ఇలాంటి క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఎంతో చక్కగా రానిస్తారని పేర్కొన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కచ్ఛపి ఆడిటోరియంలో నిర్వహించిన అతిమంచి రెండవ కార్యక్రమం ఈ క్విజ్ పోటీల నిర్వహణ అని, కమిషనర్ హరిత ఆధ్వర్యంలో చాలా చక్కని కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అభినందనలు తెలియజేశారు. తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎండి, సిఈఓ, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత మాట్లాడుతూ భవిషత్తు తరాలకు నేటి విద్యార్థులే దిక్సూచీలని, విద్యార్థుల్లోని తెలివి తేటలు పొంపొందాలనే లక్ష్యంతో తిరుపతి నగరంలోని 110 స్కూళ్ళ నుండి నలుగురు విద్యార్థులు ఒక టీమ్‌గా 440 మంది పోటీపడగా అందులో 8 టీములను సెలెక్ట్ చేయడం జరిగిందన్నారు. మంగళవారం చిల్డ్రన్స్ డే సందర్భంగా తుది పోటీల్లో మొదటి స్థానాన్ని శ్రీవెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ విద్యార్థులు కైవసం చేసుకొని లక్ష రూపాయాల బహుమతిని పొందడం జరిగిందన్నారు. రెండవ స్థానాన్ని కిరణ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకొని రూ.50 వేల, రూ.25 వేల మూడవ బహుమతిగా అట్లాంటీస్ దివరల్డ్ స్కూల్ పొందడం జరిగిందని తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ నేటి తరం విద్యార్థుల తెలివితేటలు అమోఘమని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని తీసుకురావల్సిన అవసరం ఉందని, అంతకుమునుపు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని విద్యార్థులను అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంగీతం, ఆధ్యాత్మిక డాన్స్ కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళీ, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, ఆర్వో సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ పనులు వేగవంతం చేయండి

జాయింట్ డైరెక్టరు డాక్టర్ సరళమ్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:



శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఏపీ వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టరు డాక్టర్ సరళమ్మ ఆదేశించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నాడు- నేడు కింద జరుగుతున్న విస్తరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ సరళమ్మ మాట్లాడుతూ... ఆస్పత్రి విస్తరణ పనుల్లో జాప్యం చోటు చేసుకోవడం వలన రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇంజనీరింగ్ విభాగం వారు జోక్యం చేసుకుని విస్తరణ పనులు సత్వరంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆమె ప్రభుత్వ ఆస్పత్రిలో పలు వార్డులను పరిశీలించారు. అదేవిధంగా రికార్డులు పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమె వెంట ఇన్‌ఛార్జి ఆర్ ఎంవో డాక్టర్ మధు పాల్గొన్నారు.

టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యుల రైజేషన్ నిర్ణయంపై

సీఐటీయు హర్షం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి జీఓ నెంబర్ 114 ఆధారంగా టీటీడీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల్ని రెగ్యులరైజ్ చేయాలని చేసిన నిర్ణయాన్ని సిఐటియు స్వాగతిస్తున్నదని జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. టిటిడిలో అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులు ఎదుగు బొదుగులేని జీవితాలు అనుభవిస్తున్న నేపథ్యంలో టీటీడీ పాలకమండలి నిర్ణయం స్వాగతించ దగ్గదిగా ఆయన అభివర్ణించారు. టిటిడి అటవీ భాగంలో పనిచేస్తున్న 362 మంది కాంట్రాక్ట్ కార్మికుల్లో 162 మందిని పర్మినెంట్ చేసి, 200 మందిని ఏ నిర్ణయం చేయకుండా విధుల పాలు చేశారని ఆ కారణంగా 1300 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారని ఇలాంటి అనేకమంది టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని వీరందరినీ రెగ్యులరైజ్ చేయాలని, సానుకూల దృక్పథంతో టీటీడీ ఉన్నతాధికారులు ఆలోచించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని ఆ ప్రకటనలో సూచించారు. ఈ నిర్ణయం జరగడానికి దోహద పడిన టీటీడీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డిని పాలకమండలిని సిఐటియు తరపున అభినందిస్తున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

జీవసాంకేతిక శాస్త్రంలో సుజితకి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జీవ సాంకేతిక విభాగం పరిశోధక విద్యార్థిని డి. సుజితకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. జీవ సాంకేతిక విభాగంలో ఆచార్య ఆర్.ఉష మార్గదర్శకత్వంలో 'ఇంప్రూవింగ్ అడాప్టేషన్ ఆఫ్ రైస్ టు డ్రాట్ బై స్టాకింగ్ డైవర్స్ రెగ్యులేటరీ జీన్స్ ఇన్వాల్వడ్ ఇన్ సెల్యూలర్ టోలరెన్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథం వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. సుజిత పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు. డి.సుజితకు డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

స్వర్ణలత కు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్:

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హోమ్‌సైన్స్ పరిశోధకురాలు ఎం.స్వర్ణలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల విభాగం వెల్లడించారు. హ్యూమన్ డెవలప్మెంటు అండ్ ఫ్యామిలి స్టడీస్ (హోమ్ సైన్స్) విభాగంలో ఆచార్య ఏ.కుసుమ పర్యవేక్షణలో "నాలెడ్జ్ అండ్ ప్రాక్టీసెస్ ఆన్ మేనోపాసల్ ఆస్టియోపారోసిస్ అమాంగ్ వర్కింగ్ విమెన్' అనే అంశంపై పరిశోధన గ్రంథం వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. స్వర్ణలత పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వెల్లడించారు. ఈమె ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖలో నర్సింగ్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. ఎం.స్వర్ణలతకు డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్కలపీఠం సిల్వర్ జూబ్లీ వేడుకలకు రాష్ట్రపతికి ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరగనున్న ఉత్కలపీఠం (ఒడిశా చైర్) సిల్వర్ జూబ్లీ వేడుకలకు విశిష్ట అతిథిగా హాజరు కావాలని రాష్ట్రపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విజిటర్ ద్రౌపదిముర్మును రాష్ట్రపతి భవన్‌లో కలిసి వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ జి.యస్.ఆర్ కృష్ణమూర్తి ఆహ్వానం అందించారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో త్వరలోనే జరుగుబోయే ఉత్కలపీఠం (ఒడిశా చైర్) సిల్వర్ జూబ్లీ వేడుకలకు విశిష్టాతిథిగా రావలసినదిగా రాష్ట్రపతి, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం విజిటర్ (సందర్శకురాలు) అయిన ద్రౌపది ముర్మును జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి. యస్. ఆర్ క్రిష్ణమూర్తి , న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆహ్వానించారు. జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో ఉత్కలపీఠం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న శుభసందర్భంగా త్వరలోనే విశ్వ విద్యాలయంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వైస్-చాన్సలర్ ప్రొ.జి. యస్.ఆర్ కృష్ణమూర్తి, ఉత్కలపీఠం డైరెక్టర్ డా.జ్ఞాన రంజన్ పండాతో కలిసి, ద్రౌపదిముర్ముకి స్మృతిచిహ్నం మందించి, సత్కరించి, ఈ వేడుకలకు విశిష్ట అతిథిగా రావాలని ఆహ్వానించారు. ఉత్కల పీఠం సిల్వర్ జూబ్లీ కార్యక్రమాలలో పాలు పంచుకుంటానని రాష్ట్రపతి తెలిపారు. విద్యాపీఠం డైమండ్ జూబ్లీకి కూడా రావడానికి ప్రయత్నిస్తానని చెప్పా రన్నారు. తిరుపతి సంస్కృత విద్యాపీఠం మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, ప్రభుత్వం కలిసి చాలా కార్యక్రమాలు చేయడం విన్నాను అని చెప్పి, విద్యాపీఠం విసికి అభినందనలు తెలిపారు.



రాష్ట్రపతిని ఆహ్వానిస్తున్న సంస్కృత విశ్వవిద్యాలయం విసి

పాఠశాల స్థలం కబ్జాపై చర్యలు తీసుకోవాలి

తహశీల్దారుకు పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ వినతి



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నెలవాయి పాఠశాలకు విరాళంగా ఇచ్చిన భూమి కబ్జాకు గురైందని, కబ్జాకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్తు పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఆధ్వర్యంలో తహశీల్దారు భార్గవికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నినెలవాయి గ్రామ పంచాయతీకి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గతంలో సర్వే నంబర్ 71/ బిలో ఆరెకరాల 43 సెంట్లు పాఠశాల భవనానికి విరాళంగా కొండేటి సుబ్బానాయుడు, వెంకటప్ప నాయుడు, రామానాయుడు, కృష్ణమనాయుడు ఈ భూమిని పాఠశాల భవనానికి విరాళంగా అందించారన్నారు. ఈ భూమిలో ఎకరా 70 సెంట్లు పాఠశాల భవనం నిర్మించారు. మిగిలిన భూమిలో పాఠశాల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని, ఈ భూమిని 1976 జూన్ 14వ తేదీ సత్యవేడు రిజిస్ట్రేషన్ ఆఫీసులో పాఠశాల పేరుతో రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఈ భూమిలో 1976 నుండి ప్రాథమిక పాఠశాల నుండి జిల్లా పరిషత్ పాఠశాల వరకు దశల వారీగా పాఠశాల నిర్మాణం జరుగుతూనే ఉందని, ఈ భూమిలో ఒక ఎకరా 70 సెంట్లు పాఠశాల భవనానికి పోగా మిగిలిన భూమిని పిల్లల ఆట స్థలానికి ఉపయోగి స్తున్నార న్నారు. ఈ పాఠశాల భూమిలో కొందరు నెలవాయి గ్రామస్తులు 2010వ సంవత్సరంలో ఈ భూమిని కబ్జా చేశారని పేర్కొన్నారు. అప్పటి గ్రామ సర్పంచి ఆర్ సుధా అప్పటి తహశీల్దారుకు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన తహశీల్దారు, అధికారులు గ్రామానికి పంపి ఆ కబ్జాదారుల నుండి అడ్డుకున్నారని తెలిపారు. తరువాత 2019వ సంవత్సరంలో ఆ పాఠశాల భూమిని అధికారులకు చేయి తడిపి ఆ భూమిని కబ్జా చేశారని ఈ భూమిని డి పుష్పమ్మ భర్త శివరామ నాయుడు పేరుపై ఆన్‌లైనులో ఎక్కించి పాసుబుక్ రూపొందించారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారు భార్గవికి వినతి పత్రం అందించామని తెలిపారు. పాఠశాల భవనాన్ని కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షించి పాఠశాల భూమిని పాఠశాలకు ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ధనుంజయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ సివి శ్రీనివాస్ ప్రసాద్

ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఉపాధి పనుల కోసం వచ్చిన ప్రతి కుటుంబా నికీ వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ సివి శ్రీనివాస్ ప్రసాద్ ఈ శాఖ అధికారులను ఆదేశించారు. ఏర్పేడు మండలం మన్నసముద్రం పంచాయతీ ఉపాధి హామీ పర్యావేక్షణ పాండ్ పనులను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సివి శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ ఈ ఉపాధి పనులు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను పెంపొందించాలన్నారు. భూములు కలిగి ఉన్న ప్రతి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తరగతులు, చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకం, పూల తోటల పెంపకం ఉపాధి హామీ ద్వారా చేపట్టుకుంటే వారి పొలాల్లోనే చెట్లను సంరక్షణ చేసుకుంటే వేతనాలు, మెటీరియల్ పేమెంట్లు మూడు సంవత్సరాలు పాటు ఉపాధి హామీ ద్వారా ప్రయోజనాలు పొంద వచ్చని తెలిపారు. హౌసింగ్ స్కీం ద్వారా పూర్తి చేసిన ఇళ్లల వద్ద సోక్‌పిట్‌లు నిర్మించడం వల్ల పారిశుధ్యంతోపాటు వర్షపు నీరు, కిచెన్ క ఉపయోగించిన వృథా అయిన నీటిని సోక్ పిట్ ద్వారా ఇంకింప చేయడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని పథక సారాంశాలు కూలీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి, మేట్ వెంకటయ్య పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి: టిడిపి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వైసీపీకి చరమగీతం పాడాల్సిన సమయం దగ్గరలోనే వుందని ఇందు కోసం ఇప్పటి నుంచే ప్రజలు సమాయత్తం కావాలని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్యదుర్గనాయుడు తెలిపారు. మండలంలోని వెన్నెంపల్లి, కారణిపట్టు కంచన పుత్తూరు గ్రామాలలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ నిమిత్తం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డారని అటువంటి నాయకుడిపై జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. చంద్రబాబుపై ఎన్ని కేసులు పెట్టినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ కో ఆర్డినేటర్ రమేష్, నాయకులు దసయ్య, మునెయ్య, గుణశేఖర్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ విద్యా, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ తిండి దొరకని పేదలకు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో పనిచేస్తుందని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరినాథ్ తెలిపారు. మంగళవారం గూడూరు పట్టణం లోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆహార చేయూత పథకంలో భాగంగా సీనియర్ లైన్స్ క్లబ్ సభ్యుడు దయాల్ సహకారంతో ఎంపిక చేసిన పేదలకు నిత్యా వసర వస్తువులు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో , లైన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ శరత్ బాబు గూడూరు లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : నెహ్రూ జీవితాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని పుత్తూరు మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. శాఖా గ్రంథాలయం వారు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పుత్తూరు గ్రంథాలయాధికారి కే.మీనా కుమారి ఆధ్వర్యంలో జోహార్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి మున్సిపల్ చైర్మన్ ఏ హరి ప్రారంభించారు. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం శాఖా గ్రంథాలం పుత్తూరులో జరుపుకున్నారు. జవహర్ లాల్ జీవిత విశేషాల గురించి పిల్లలకు తెలిపారు. పిల్లలకు పాఠకులకు చాకెట్లు పంచి జవహర్ లాల్ నెహ్రూను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో,హిందీ ఉపాధ్యాయులు (రిటైర్డ్ ఉద్యోగులు ఎ.శంకరయ్యి, ఎస్.సుధాకర్ రాజు, విద్యార్థి నులు పాల్గొన్నారు.

ఘనంగా వివివి ఆర్‌కె రాజా 99వ జయంతి

ప్రజాశక్తి- వెంకటగిరి: తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని కైవల్య నది ఒడ్డున ఉన్న వివివి ఆర్ కె యాచేంద్ర 99 వ జయంతి వేడుక మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాసిపేటలోని పెద్ద ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ జయంతిని పురస్కరించుకుని వివిధ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ పట్టణ సమయకర్త ఢిల్లీ బాబు మాట్లాడుతూ రాజరికపు పాలనలోను, నేటి సమకాలిన రాజకీయ పాలనలోను ప్రజల శ్రేయస్సుకు వారికి ఇంటి స్థలాలు, ఫలాలు దానాలు చేసిన ఘనత వెలుగోటి వంశీయులకే దక్కుతుందదన్నారుదీ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాలయ్య ప్రజలకు వెంకటగిరి రాజులు దానం చేశారని, వివి వి ఆర్ కె యాచేంద్ర ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఉన్నకాలంలో ప్రజల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా విభాగం జలగం కామాక్షి, కౌన్సిలర్లు ఎంఎ నారాయణ, ఆరి శంకరయ్య, వైసిపి నాయకులు మురుగ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో ఇవ్వాలి

ప్రజాశక్తి -కోట : కోట మండలం పట్టణ పరిధిలో కోట గ్రామంలో ఉన్న రేషన్ షాపులు నాల్గింటిలో సమయానుకూలంగా ఇవ్వడం లేదని స్థానిక కోట ఎంపిటిసి షేక్. షంషుద్దీన్,టీడీపీ నాయకులు నౌషద్ బాష, నాయబ్ రసూల్,వార్డు మెంబెర్ బాబు అన్నారు. కోట ఎంపిడిఓ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా రేషన్ దారులకు ఉచిత రాగులు, గోధుమపిండి ప్రతి రేషన్ కార్డుదారులకు సకాలంలో పంపిణీ చేసే విధంగా స్థానిక సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఈ రేషన్ షాప్ పరిధిలో 700 రేషన్ కార్డు దారులు ఉన్నారని తెలిపారు.

నిస్వార్థ సేవా నాయకుడు భాస్కర్ యాదవ్: టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - క్యాంపస్ : అహర్నిశలు ప్రజల కోసం ప్రజా ఉద్యమాలలోని నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో ఎదిగిన, ఎదుగుతున్న నాయకుడు దంపూరి భాస్కర్ యాదవ్ అని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పొట్టి హేమంత్ రాయల్ పేర్కొన్నారు. తిరుపతి టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాంపూర్ భాస్కర్ యాదవ్‌కు హేమంత్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు ఆయన నివాసంలో మంగళవారం పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్ జన్మదిన సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, వెంకటాద్రి యాదవ్, నాని, సాయి, జయకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఆర్‌జెడి



ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని కుప్పం బాదూ రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్జెడి వెంకట కృష్ణారెడ్డి మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ బుక్కు, నోట్ బుక్ లను, ప్రగతిని పరిశీలించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్పి) వినియోగం పై ఆరాతీశారు. మరుగుదొడ్ల గదులపై బాలురు బాలికలని బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. తరగతి గదులకు స్వాతంత్ర సమరయోధుల పేర్లు పెట్టాలని చెప్పారు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం కుప్పం బాదూరు ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్, డివైఈవో ఆనంద రెడ్డి, ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు. ప్రధానో పాధ్యాయులు సుజనకుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: నెహ్రూ జయంతిని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా పార్థనా సమావేశంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి బాలల దినోత్సవం ప్రాముఖ్యత, బాలల హక్కులు, బాధ్యతలపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె రమణయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు బాలలు పాల్గొన్నారు.



బుచ్చినాయుడు కండ్రిగలో




మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది కె మురుగేషన్ రెడ్డి

పుత్తూరు టౌన్ : నేటి బాలురే రేపటి పౌరులు అని న్యాయ వాది మురు గేష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మెయిన్ స్కూలులో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాది మురుగేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని పిల్లలు బడి మానరాదని విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తుందని, 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో ఉంచు కోకూడదని బాల కార్మికుల నిర్మూలన చట్టం, ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పాఠశాల ప్రధానోపాధ్యాయ కే మురళి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : జవహర్ లాల్ నెహ్రూ దేశానికి అందించిన సేవలు ప్రశంసనీయమని ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు చేపట్టిన ప్రాజెక్టులు దేశానికి వెన్నుదన్నుగా నిలిచాయని తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు . మంగళవారం గూడూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశే ఖర్ , తాజుద్దీన్ , నెహెమియా వేమయ్య , బాస్కర్ రెడ్డి , అరీఫ్ పాల్గొన్నారు.

గూడూరు రూరల్ : జవహర్ లాల్ నెహ్రూ జయంతిని చిల్డ్రన్స్ డే గా దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నవంబర్ 14వ తేదీన నిర్వహిస్తూ నెహ్రూ ను గౌరవించుకుంటున్నామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ తెలిపారు . మంగళవారం తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డిఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని నిర్వహించారు . సబ్ కలెక్టర్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ , సిబ్బంది నివాళులు అర్పించారు .

చిల్లకూరు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిల్లకూరు మండల పరిధిలోని ఎన్ఆర్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో గూడూరు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్ పదవ తరగతి విద్యార్థులకు స్టడీ చైర్స్ , ప్యాడ్లు ను అందచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరినాథ్ , దయాళ్ , శరత్ బాబూ, రవిచంద్ర , శివయ్య , వీరేంద్రనాథ్, శరత్ బాబు, గురునాథం, రామ్మోహన్ , రమణయ్య, మదనమేటి రమణయ్య , శ్రీనివాస్ రెడ్డి, కళ్యాణ సాయి, సుధీర్, పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.



గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో

ఏర్పేడు: మండలంలోని స్థానిక రాజుల పాలెం ఎస్టి కాలనీ, చిందేపల్లి ఎస్టి కాలనీల లో నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు పలు ఆట పోటీలు నిర్వహించి ప్రోత్సాహంగా బహుమతులు అందించామని యువ నేస్తం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు అరుణ, నాగమణి, వాలంటీరీలు వెంకటేష్, అంకయ్య, లక్ష్మీ, మీనా, హేమ, శ్రావణ పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: తిరుపతి నగర కాంగ్రెస్ అధ్యక్షులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో స్థానిక సంజయ్ గాంధీ కాలనీ నగర పార్టీ ఆఫీస్ లో నెహ్రూ జయంతి సందర్భంగా ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యార్లపల్లి గోపి మాట్లాడుతూ పండిట్ నెహ్రూ దేశ స్వాతంత్ర్యం కోసం 9 సంవత్సరాలు దుర్భర జైలు జీవితం గడిపారని, ఆరు సంవత్సరాలు కాంగ్రెస్‌కి జాతీయ అధ్యక్షులుగా పనిచేసి అసలైన కాంగ్రెస్ వాది అనిపించుకున్నారన్నారు. 17 సంవత్సరాలు దేశ ప్రధానిగా నవ భారత నిర్మాణానికి పునాది వేశారన్నారు. నెహ్రూ ప్రతిష్టను తగ్గించాలని బిజెపి ప్రయత్నించడం శోచనీయం అన్నారు. నెహ్రూ జీవిత చరిత్ర అందరికీ స్ఫూర్తిదాయకం, ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ తిరుపతి అధ్యక్షులు షేక్ జావిద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుప్రజ దేవరాజుల, లీగల్ సెల్ అధ్యక్షులు రవి, మైనార్టీ నాయకులు అబ్దుల్ మజీద్ పటేల్, సమీయుల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ గౌడ్, మహేష్ మహిళా కాంగ్రెస్ నాయకులు తేజవతి, శాంతి పాల్గొన్నారు.

కోట : ప్రతి రంగంలో పోటీ తత్వంతో ప్రణాళిక బద్ధంతో ముందుకు సాగితే భవిష్యత్తులో మరెన్నో ఉపయోగాలు ఉంటాయని కరస్పాండెంట్ పసుపు లేటి కిషోర్ అన్నారు. ఈ సందర్భం గా కోట మండలంలోని శ్రీ ప్రగతి విద్యానికేతన్,శ్రీ చైతన్య స్కూల్,తదితర పాఠశాల లో ఘనంగా బాలల దినోత్సవంను పురస్కరించుకొని నెహ్రూ పటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు డ్రాయింగ్,వక్తృత్వ, తదితర పోటీలు నిర్వ హించి విజేతలకు బహు మతి ప్రదానం చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టు కున్నాయి. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషో ర్ మాట్లాడారు. ఈ కార్యక్రమం నిర్వహణపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



కోటలో

శ్రీకాళహస్తి: ఎన్ని అవరోధాలు ఎదురైనా విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలని ప్రపంచ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుధామయి సూచించారు. స్థానిక డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కాసాగార్డెన్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం 135వ బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుధామయి, ప్రత్యేక న్యాయాధికారి శంకర్ మాట్లాడుతూ కన్నతల్లి గొప్పతనం, తల్లుల త్యాగనిరతిని విద్యార్థినులకు చక్కగా వివరించారు. చాచాగా, దేశ ప్రధానిగా నెహ్రూ ఎలా మారారో వివరించారు. ప్రశ్నించడం, హక్కుల కోసం పోరాడడం మొదలు పెడితేనే స్త్రీ శక్తిగా మారుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్.ప్రభావతి పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో

రేణిగుంట: రేణిగుంట మండలం వెదల్ల చెరువు ఎస్టి కాలనీ లోని ప్రభుత్వ పాఠశాలలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వైసిపి నాయకులు గిరి రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చంద్ర వర్ధిని చేతుల మీదుగా పిల్లలకు నోట్ పుస్తకాలు, స్టడీమెటీరియల్స్ ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలయన్ రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూలియన్ రాజు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంట శాఖ గ్రంథాలయంలో బాల దినోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ నగేష్ పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీముఖి పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వార్డు నెంబరు ప్రధానోపాధ్యాయులు మునిరత్నం ఉపాధ్యాయులు విశాంత్రి పాల్గొన్నారు.

పాకాల: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దామలచెరువుకు బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్ మ్యాంగో వారిచే 20 కుర్చీలు బహుకరించారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని 120 మంది పిల్లలకి మిఠాయిలు అందించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్ పర్సన్ కేవిఎస్ మస్తాన్,విద్యా, ఆరోగ్యం దామలచెరువు అధ్యక్షులు పొదిలి నాగూర్ భాష పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మంగళం పరిధిలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం, బాలుర గృహం, ప్రత్యేక గృహం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జువైనల్ జస్టిస్ బోర్డు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ సంధ్యారాణి, జోయల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ సుకుమార్, చిత్తూరు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వసంత లు ముఖ్య అతిథులుగా హాజరై బాలల హక్కుల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశీలన గృహం పర్యవేక్షణ అధికారి షణ్ముఖరావు, చిల్డ్రన్స్ హోమ్ పర్యవేక్షణ అధికారి సుధాకర్, ఉప పర్యవేక్షణాధికారి త్రినాథ్ రావు, బాలుర సంక్షేమ అధికారి మోహన్ బాబు, ప్రొబేషన్ ఆఫీసర్ లక్ష్మీపతి, శ్రీధర్, పుష్పలత, పుల్లమరాజు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూకు నివాళులర్పించారు. తిరుపతి కి చెందిన పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూమెంట్ సంస్థ పాఠశాలకు 550 మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్ లు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ యం గిరి ప్రకాష్, పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూమెంట్ సంస్థ సభ్యులు మల్లీశ్వరి పాల్గొన్నారు.



తిరుమలలో

తిరుమల: బాలల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్ఎన్ పురం శ్రీ చైతన్య బ్రాంచ్‌లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నచిన్న నాటకాలు ద్వారా ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలని సందేశాన్ని అందించారు. ఉపాధ్యాయులు కూడా నాటికలను ప్రదర్శించి విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపల్ లక్ష్మి, మోహన్ బాబు, డీన్ రాజశేఖర్ పాల్గొన్నారు.



తిరుపతి సిటీ: విద్యార్థుల నేటి భావి భారత పౌరులని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తిరుపతి హోటల్స్ అసోసియేషన్ నగర అధ్యక్షులు చిలీస్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అధినేత సిలీస్ అంజి తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిలీస్ అంజి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు పాఠశాలలలో నిర్వహించిన ఈ వేడుకలకు చిలీస్ అంజి హాజరై చిల్డ్రన్స్ డే గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆయా పాఠశాలలోని పిల్లలకు మిఠాయిలు స్వీట్లు పంచిపెట్టారు. ప్రధానంగా ప్రభుత్వ మునిసిపల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ తినుబండరాలు అందించారు. ఈ కార్యక్రమంలో చిలీస్ సిబ్బందితో పాటు ఆయా పాఠశాలల, హెడ్ మాస్టర్స్, అధ్యాపక బృందం, స్నేహితులు రాజా విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తిరుపతి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో I.P.NO. 29 / 2018

కె. మునిరాజ ....పిటిషనర్

Vs

లక్ష్మి రమణరావు మరియు 17 మంది ఇతరులు ....రెస్పాండెంట్స్

NOTICE TO THE RESPONDENT NO.13

R13. ఎన్. పురంధర్, S/o ఎన్. మునస్వామి, డోర్ నెం.9-11, అన్నెప్పమొదలి వీధి, పాపానాయుడుపేట, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.

పై నెంబరు ఐ.పి దావా నందు కోర్టువారు మీదావా నోటీసులు అనేకసార్లు పంపిననూ మీరు కావాలని తీసుకోకపోవటం వలన కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పై నెంబరు దావా వాయిదా తేది.30-11-2023న కలదు. మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30గం॥లకు మీరు స్వయంగా గాని, మీతరపున న్యాయవాది ద్వారా గాని హాజరు అయి తగు సమాధానములు దాఖలు చేసుకొనగలరు. లేనియెడల పై నెంబరు దావా యందు మీకు పరోక్షముగా తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 30-11-2023, తిరుపతి.

ఇట్లు,
ఆర్. బాలక్రిష్ణారెడ్డి,
న్యాయవాది, తిరుపతి. సెల్ : 7989152008.

కాలువలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

ఇరిగేషన్ శాఖ అధికారుల హెచ్చరిక

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని కోట క్రాస్ రోడ్డు విద్యానగర్ మధ్యలో చల్ల కాలువలో ఎవరైనా కాలువలో వ్యర్థ పదార్థాలను పడేస్తే తక్షణమే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ అధికారులు హెచ్చరించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఈ కాలువ ద్వారా పెన్నక్క చెరువుకు నీటి పారుదల ఉంటుందని గుర్తు చేశారు. ఈ నీటి పారుదల ద్వారా ఎంతో మంది రైతులు పంట పొలాలకు ఉపయోగించుకుంటున్నారని గుర్తు చేస్తూ ఇలాంటి సందర్భాల్లో వ్యర్థ పదార్థాలు నీటిలో కలుషితమై అనేక రకాలుగా రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కోట మండలంలోని ప్రజలందరూ గమనించి ఎలాంటి వ్యర్థ పదార్థాలను కాలువ లో పడేయ కుండా చూ డా లన్నారు. ఒకవేళ విరుద్ధంగా ఎవరైనా పెద్ద వ్యర్థ పదార్థా లను కాలువ లో పడేస్తే తక్షణమే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసు కుంటామని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని ఆయా శాఖ అధి కారులు ఏ ఈ మునికృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా తెలిపారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

దిశా యాప్ పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, ఉమెన్ ఎంపోర్సుమెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం దిశా యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దిశా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీరాముడు హాజరై సమాజంలో మహిళలు కొన్ని అసాంఘిక సంఘటనలకు బలవుతున్నారని, మహిళలకు ఏదైనా ఇబ్బందికర వాతావరణం ఏర్పడితే మహిళల రక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దిశా యాప్ ద్వారా పోలీసు రక్షణ పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఆండ్రాయిడ్ మొబైల్లో దిశా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. దిశా యాప్ ద్వారా ఆపదలో ఉన్న మహిళకు వెంటనే రక్షణ లభిస్తుందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థినులకు మంచి రక్షణ వాతావరణాన్ని ఏర్పాటు చేశామని, ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే గట్టి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, నిర్వాహకులు గ్రీష్మ, చంద్రకళ, దిశా పోలీస్ సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పలకరించాలి:ఎంపిపి

ప్రజాశక్తి - బాలాయపల్లి : సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పలకరించి సంక్షేమ పథకాలపై తెలపాలని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జయంపు గ్రామంలో వైసిపి మండల కన్వీనర్, జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్రానికి జగన్ అన్న ఎందుకు? అనే కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమీలరాణి, ఇన్ చార్జి ఈఓ ఆర్ డీ మోహన్ రాజు, నాయకులు రమేష్ నాయుడు, వెంకటరమణ రెడ్డి, రంగనాధం, పల్లంటి.రాంబాబు నాయుడు పాల్గొన్నారు.

జనసేన, టిడిపి ఉమ్మడి సమన్వయకర్తగా 'గూడూరు'

ప్రజాశక్తి -వెంకటగిరి : ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి గా పనిచేస్తున్న గూడూరు వెంకటేశ్వర్లుని జనసేన , టిడిపిల ఉమ్మడి సమన్వయకర్తగా నియమిస్తూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాన్ని జనసేన కార్యకర్తలు, నాయకులు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీ ఆదేశించే ప్రతి కార్యక్రమాన్ని తప్పకుండా పాటిస్తూ జనసేన కార్య క్రమాలను ముందుకు తీసుకెళ్లిన గూడూరు వెంకటేశ్వర్లుకి సరైన గుర్తింపు వచ్చిందని పట్టణంలో పలువురు రాజకీయ విశ్లేషకులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశారు.

రూల్ 22 నోటీసు

శ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.NO. 40 / 2022, O.S.NO. 7 / 2013

డి. జనార్ధన్ ...పిటీషనరు/డిక్రీ హోల్డరు

Vs

పర్వతాల మురలీధర్ ....రెస్పాండెంటు/జడ్జిమెంటు డెటార్

శ్రీపర్వతాల మురలీధర్, తండ్రి. దశరధరామయ్య, వార్డు / డోర్ నెంబరు /187-1-1, ధూర్జటినగర్, తూర్పు గూడూరు, గూడూరు పట్టణం, తిరుపతి జిల్లా.(గతంలో శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా) వారికి.

పై నెంబరు దావాలోని డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు గాను డిక్రీ హోల్డరు మీపై ఇ.పి.(ఎగ్జిక్యూషన్ పిటిషన్) ని దాఖలుచేసి పై తెల్పిన కోర్టు వారి నుండి మీకు రూల్ 22 సి.పి.సి నోటీసు ప్రకారం జారీ చేయుటకు ఉత్తర్వులు పొందియున్నారు. పై నెంబరు ఇ.పి.లో మీకు నోటీసు కొరకు తేది.21-11-2023 కి వాయిదా వేసియున్నారు.కావున మీరు తేది. 21-11-2023న పై తెల్పిన కోర్టు వారి యెదుట ఉదయం 10.30 గం॥ని॥లకు ప్రత్యక్షంగా గాని, లాయరు ద్వారా గాన సదరు విషయమై ఏదైనా ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలసినది. అట్లు కాని యెడలపై విషయము మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు,
ఎ. విజయభాస్కర్, బి.ఎస్సీ., బి.ఎల్.,
డిక్రీ హోల్డరు తరపున న్యాయవాది, గూడూరు.

తెల్లరాయి రవాణా జెసిబి, టిప్పర్ స్వాధీనం

తనకు సంబంధం లేదంటున్న తహశీల్దారు

ప్రజాశక్తి -బాలాయపల్లి : పచ్చని పొలాల్లో సైతం తెల్లరాయిని అక్రమార్కులు లోడేస్తున్న సంఘటన తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం నాయుడు చెరువు కండ్రిక(పెండేరెడ్డిపల్లి)గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం మేరకు.. రాత్రి అయితే తెల్లరాయి దొంగలు అడవిలో చొరపడి సంపదను దోచుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులకు అధికారులు అండ దండలు పూర్తిగా ఉండడంతో తెల్లరాయి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అటవీ, ప్రభుత్వ భూములను సైతం వదలకుండా కనిపించిన చోట జెసిబితో అక్రమంగా తవ్వకాలు చేసి లక్షలు ఆర్జిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారు కావడం, ముఖ్య నేతల అండదండలు ఉండటంతో అటవీశాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో తెల్లరాయి వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

క్వారీని నిర్వహించాలంటే ముందు మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత తహశీల్దార్ ద్వారా ఎన్‌వోసీ తీసుకోవాలి. మైనింగ్ అధికారుల నుంచి అనుమతి లభించాక క్వారీ పనులు చేపట్టాలి. భూమి నుంచి వెలికి తీసిన రాయికి టన్నేజీ ప్రకారం విలువకట్టి ప్రభుత్వానికి రుసుంచెల్లించాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా ఇక్కడ తెల్లరాయిని తవ్వుతున్నారు. తద్వారా ప్రభుత్వానికి రావలసిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారు.



సంబంధం లేదంటున్న తహశీల్దారు

మండలంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా తెల్లరాయిని అనుమతులు లేకుండా తెల్లరాయి తవ్వకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వస్తే వాహనాలు సీజ్ చేస్తున్నామని తహశీల్దారు తెలిపారు. పోలీసులకు అప్పగించకుండా వదిలేస్తున్నారు? మండల మేజిస్ట్రేట్ మీకు బాధ్యత లేదా?' అని అడిగితే తనకు సంబంధం లేదు.. మైనింగ్ వాళ్లదని మాట దాటవేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన వారే అలా మాట్లాడడం ఏమిటో తెలియడం లేదు. పట్టుకున్న జెసిబి, టిప్పరని పోలీసులకు అప్పగిస్తారో లేదో వేచి చూడాలి.

IN THE COURT OF THE M.A.C.T CUM X ADDITIONAL DISTRICT JUDGE OF :: TIRUPATI
M.V.O.P. NO. 88 OF 2023,

D. Maheswaramma and another ...Petitioners

Vs

G. Selvam and 2 others ....Respondents

NOTICE TO THE RESPONDENT NO.2

To,
R.2 : Paila Joga Rao,
S/o Late Paila Rajaiah,
Resididng at D.No. 22-11-77/1,
Pulavani Gunta,
Tirupati Urban Mandal,
Tirupati District.

Please take notice that the Petitioners filed the M.V.O.P.NO. 88/2023 against the Respondents for the compensation amount and the matter is posted for your appearance before this Hon'ble Tribunal on 14-12-2023 at 10.30 a.m. either in person or through your counsel. In the event of your failure, the matter will be decided exparte.
Hearing Date : 14-12-2023.

SRI. L. VIJAYULU REDDY,
SRI.M. MUNIRAJA.,
ADVOCATE FOR PETITIONERS.